కూలుతున్న వంతెన

- ప్రమాదకరంగా మారిన ప్రయాణం
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



కూలుతున్న గుమ్మిర్యాల్ - కొండాపూర్ మార్గంలోని వంతెన

మోర్తాడ్: ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్, జగిత్యాల్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండాపూర్‌ల మధ్య రోడ్డుకు అనుబంధంగా ఉన్న వంతెన కూలుతోంది. ఏడేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన పనులు నాడు నాసిరకంగా చేపట్టడంతో వంతెన మనుగడ పది కాలాల పాటు సరిగా లేకపోయింది. వంతెన కూలుతుండటంతో ఈ మార్గంలో రవాణా ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే వంతెన పూర్తిగా కూలిపోయి ఇరు జిల్లాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. ఇటీవల కొందరు ఇసుక వ్యాపారులు గుమ్మిర్యాల్ గోదావరి నది నుంచి భారీ వాహనాల్లో ఇసుకను ఈ వంతెనపై నుంచి ఎంతో స్పీడ్‌గా తరలించడం కూడా వంతెన కూలడానికి కారణం అని స్థానికులు సందేహిస్తున్నారు. వంతెనను తొలగించి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని పలువురు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- పడగల్ వంతెన వద్ద కోతకు గురవుతున్న రహదారి



వంతెన వద్ద కోతకు గురవుతున్న రహదారి

వేల్పూర్: మండలంలోని పడగల్ పెద్ద ఒర్రెకు నిర్మించిన హైలెవల్ వంతెనకు ప్రమాదం పొంచి ఉంది. వంతెనకు రెండువైపులా ఉన్న రోడ్డు లింకు అంచు భాగాలు కోతకు గురయ్యాయి. భారీ వర్షం కురిస్తే వంతెనకు ఉన్న రోడ్డు లింకు ఎక్కడ తెగిపోతుందోనని వాహనదారులు, గ్రామస్తులు భయపడుతున్నారు. పడగల్‌లో మేజర్ చెరువైన నవాబు చెరువు వరద ఇదే ఒర్రె ద్వారా ప్రవహిస్తుంది. గతంలో ఇక్కడ లో లెవల్ వంతెన ఉండేది. 2016లో కురిసిన భారీ వర్షంతో ఒర్రెకు వచ్చిన వరద ప్రవాహం తెలియక రాత్రిపూట ఈ ప్రాంతంలో వచ్చిన కారు అందులో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు మరణించారు. దీంతో గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సుమారు రూ. 2 కోట్ల 75 లక్షలతో ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మింపజేశారు. గత ఏడాది జూలై 24న వేల్పూర్ మండలంలో 64 సెంటీమీటర్ల అతిభారీ వర్షం కురిసింది. దీంతో నవాబు చెరువు తెగిపోయి వచ్చిన వరద, ఊరచెరువు నుండి, వ్యవసాయ క్షేత్రాల నుంచి వచ్చిన వరదతో హైలెవల్ వంతెనకు రెండువైపులా గండ్లు పడ్డాయి. తర్వాత మట్టి పోసి గండ్లు పూడ్చారు. కానీ వంతెనకు ఆనుకొని ఉన్న రోడ్డు లింకు మూలలకు ఎత్తుగా, పటిష్టంగా తెట్టెరాయిని అమర్చకపోవడంతో వర్షానికి కొద్ది కొద్దిగా మట్టి కోతకు గురవుతోంది. ఒకవేళ గత ఏడాది మాదిరిగా భారీ వర్షం కురిస్తే వంతెనకు, రోడ్డుకు లింకు తెగిపోయి రాకపోకలు స్తంభించిపోయే అవకాశం ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు దీనిని గుర్తించి రోడ్డు అంచు పైవరకు తెట్టెరాయిని పెట్టించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



తండాలో శిబిరాన్ని పరిశీలిస్తున్న తుకారాం



పెర్కిట్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

మాక్లూర్: ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి తుకారాం అన్నారు. మండలంలోని వేణుకిసాన్‌నగర్ తండాలో బుధవారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వేణుకిసాన్‌నగర్‌తండాను దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పని చేస్తున్న ఏఎన్‌ఎం సంధ్యను జిల్లా వైద్యశాఖ తరఫున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ దినేశ్, తిరుపతిరావు, స్థానిక మెడికల్ అధికారి వెంకటేశ్వర్, సీహెచ్‌వో ఆనంద్, దేవపాల, సుధాకర్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో..

పెర్కిట్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆర్మూర్ మండల ప్రత్యేక అధికారి, డీసీవో శ్రీనివాస్‌రావు సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలన్నారు. అనంతరం అంకాపూర్‌లో బృహత్ పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సురేశ్, గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: సీజనల్ వ్యాధులకు గురి కాకుండా ఉండేందుకు విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలని కోటగిరి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాధులపై బుధవారంఅవగాహన కల్పించారు. సిబ్బంది రోజా, మంజుల, అనురాధ, గంగామణి, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని హెచ్‌ఈవో గోవర్ధన్ తనిఖీ చేశారు. సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే..

వేల్పూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని వేల్పూర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ నాగమణి పేర్కొన్నారు. మండలంలోని పచ్చలనడ్కుడ ప్రైమరీస్కూలులో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు హరిచరణ్, ఆరోగ్యకార్యకర్తలు రోజ్‌లిన్, సుచిత్ర, గోదావరి, చిన్నుబాయి, రాజహంస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెయూ కామర్స్ విభాగాధిపతిగా రాంబాబు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ గోపిశెట్టి రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్-ఛాన్సలర్ సందీప్‌కుమార్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి బుధవారం ఉత్తర్వులు అందజేశారు. ప్రొఫెసర్ రాంబాబు ప్రస్తుతం కామర్స్ విభాగానికి డీన్‌గా వ్యవహరిస్తున్నారు.

పురం నవీన్‌కు డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధక విద్యార్థి పురం నవీన్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ అసోసియేట్ ప్రొఫెసర్ బి.సాయిలు పర్యవేక్షణలో 'సింథసిస్ అఫ్ నావెల్ అమైడ్ ఫంక్షనలైజ్‌డ్ ట్రిఫ్లోరో మిథైల్ పిరిడిన్ డెరివేటివ్స్ థీర్ ఫార్మాకోలాజికల్ యాక్టివిటీ' అనే అంశంపై నవీన్ పరిశోధన జరిపి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు నాందేడ్, లాల్‌బహదూర్ శాస్త్రి యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్‌బీ పట్వారీ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. పరిశోధకుడిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కళాశాల ప్రిన్సిపాల్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ సీహెచ్ హారతి, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ, అధ్యాపకులు పాల్గొన్నారు. నవీన్‌ను సత్కరించి, అభినందించారు.

క్లుప్తంగా

ఎమ్మార్సీలో ఫిజియోథెరపీ శిబిరం

వేల్పూర్: మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం అంగవైకల్యం ఉన్న చిన్నారులకు సమగ్రశిక్షా ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. వైద్యురాలు అరుణ అంగవైకల్యమున్న విద్యార్థులకు వైద్యం చేశారు. తాము సూచించే విధానాలను తల్లితండ్రులు చిన్నారులకు ప్రతిరోజు ఇంటి వద్ద చేయిస్తే కొంత నయమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు శైలజ, మౌలిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

రుద్రూర్: సమస్యల పరిష్కారానికి జీపీ కార్మికులు ఈనెల 11న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని ఐఎఫ్‌టీయు జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలకు మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ధర్నా కార్యక్రమాన్ని కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ సభ్యులు, జీపీ కార్మికులు నర్సింలు, రాజు, నాగయ్య, శంకర్, లక్ష్మణ్, రాజమణి, గంగారాం పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



వర్ని(మోస్రా): మండలంలోని దుబ్బ తండాలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మండల ప్రత్యేక అధికారి రమేశ్ బుధవారం పరిశీలించారు. జీపీ పరిధిలో ఉన్న పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించి నర్సరీలో పెరుగుతున్న మొక్కల సంరక్షణతో పాటు చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. ఎంపీవో మహమ్మద్ రఫీ, ఏపీవో సురేశ్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి ఉన్నారు.

వికాస తరంగిణి ప్రయత్నం అభినందనీయం



మాక్లూర్: క్యాన్సర్ రహిత సమాజానికి వికాస తరంగణి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని డాక్టర్ రమాదేవి అన్నారు. మానిక్‌బండార్ శివారులోని ఆర్టీసీ కాలనీలో వికాస తరంగణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత మహిళ ఆరోగ్య శిబిరానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రధానంగా మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు విరివిగా వస్తాయని వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని జిల్లా వికాస తరంగణి వీఐఏ పరీక్ష ద్వారా కల్పోస్కోప్ అనే పరికరంతో ఉచిత పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వికాస తరంగణి జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీప్రభాకర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాజేందర్, ఎం రోహిత్, వి సుమన్, జి హనుమంత్‌రెడ్డి, జి సుదర్శన్‌గౌడ్, డీవీ రాములు, అశోక్, రంగాచారి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మాక్లూర్: కార్మికుల సౌకర్యార్థం ఐఎంఎల్ డిపోల విశ్రాంతి గదులను నిర్మించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని డిపో కార్మికులు తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. డిపోలో కార్మికులకు సరైన సౌకర్యాలు లేవని సీఐటీయూ మండల నాయకుడు కొండ గంగాధర్ అన్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు లక్ష్మీనారాయణ, దుబాయ్ శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే అందించాలి

బోధన్ రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సప్లై చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎండీఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి అన్నారు. అనంతరం ఎంఈవో నాగనాథ్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రూప, ఉమా, శ్యామ్‌రావు, లక్ష్మి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక రోడ్డు సమస్య పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్: చేపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని శ్మశాన వాటిక రోడ్డును పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ గజానంద్‌కు గ్రామ నాయకులు, యువకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కొందరు శ్మశాన వాటికకు చెందిన భూమిని కబ్జా చేసి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, శాంతి కుమార్, సిద్ధుకార్ చరణ్, సురేశ్, రుక్మాజీ, గంగారాం, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో విలువైనది



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ

రుద్రూర్: రక్తదానం ఎంతో విలువైనదని రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ధాత్రి శ్రీ ఫౌండేషన్, రుద్రూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో ధాత్రిశ్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గాండ్ల మధు, ప్రశాంత్ గౌడ్, కాసుల ఉమామహేశ్వర్, సాయికిరణ్, సుధాకర్, శ్రీనివాస్, గణేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ శ్యామ్ సుందర్ పహాడే, రెడ్‌క్రాస్ జిల్లా సభ్యులు వై శ్రీనివాస్, సూర్యనారాయణ, భాస్కర్, వెంకట్, శివ కుమార్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌టౌన్: మండలంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి జన సమితి రాష్ట్ర కార్యదర్శి తులసీరామ్ అన్నారు. మండల కేంద్రంలోని బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లి తండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. సమావేశంలో రాజు, గోపి, మోహన్, రాము, లత, లక్ష్మి, గంగాసాగర్, రాణి ఉన్నారు.

డిజిటల్ పాఠాలతో ఎంతో మేలు



బషీరాబాద్‌లో డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

మోర్తాడ్: డిజిటల్ తరగతులతో విద్యార్థులకు ఉత్తమ బోధన అందుతోందని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి సాయాగౌడ్ అన్నారు. మండలంలోని బషీరాబాద్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న డిజిటల్ తరగతుల నిర్వహణ బాగుందని అన్నారు. అనంతరం హాసకొత్తూర్‌లోని ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద బిగించిన నీటి ఫిల్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో ఆంధ్రయ్య, ఏపీవో విద్యానంద్ తదితరులు ఉన్నారు.

ముగిసిన యోగా శిక్షణ

పెర్కిట్: పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్టు ఇందూర్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. యోగా సాధకులు పతంజలి జిల్లా అధ్యక్షుడు తొర్తి బుచ్చన్నను పలువురు సన్మానించారు. అనంతరం పలు గ్రామాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడిగా దొంద నాగరాములు, పతంజలి అధ్యక్షుడిగా బొంబాయి రాజేశ్వర్, కిసాన్ సేవా సమితి అధ్యక్షుడిగా సదమస్తుల జనార్దన్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా ఏంపల్లి అనిల్ గౌడ్, కోశాధికారిగా లిక్కి దేవేందర్, సంవాడి ప్రభారిగా కొక్కుల లింగం, మహిళా కమిటీ గ్రామ ప్రభారిగా భారతి, మహామంత్రిగా పావని, సంఘటన కార్యదర్శిగా రాధ, మీడియా ప్రభారిగా స్వరూపరాణి, కోశాధికారిగా పద్మ ఎన్నికయ్యారు.

డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందిపేట్: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలతో పాటు ఉర్దూ ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. మండల ప్రజల చిరకాల కోరిక అయిన డిగ్రీ కళాశాల, ఉర్దూ ఇంటర్ కళాశాలను మంజూరు చేయించాలని కోరారు.

సంక్షిప్తం

కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

నందిపేట్: తమకు వేతనాలు చెల్లించాలంటు గుత్ప ఎత్తిపోతల పథకం నందు పనిచేసే కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టర్లు ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదంటూ ఎత్తిపోతల పథకం ముందర నిరసన తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని జీతాలు ఇప్పించి తమ సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

భీమ్‌గల్: కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాబాపూర్, పిప్రి, లింగాపూర్ గ్రామాలను బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో గంగామోహన్, ఏపీవో నర్సయ్య, గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

నందిపేట్: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని కోరుతూ జీపీ సిబ్బంది బుధవారం ఆందోళన చేపట్టారు. కార్మికుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో చేపట్టే ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కార్మికుల సంఘం నాయకుడు గంగాధర్ కోరారు.

ప్రజల వద్దకు వెళ్లి బ్యాంకు ఖాతాలు

నందిపేట్: మండల కేంద్రంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ట్యాబ్ బ్యాంకింగ్ కార్యక్రమంలో ప్రజలకు సత్వర సేవలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం బ్యాంకు సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి నూతన ఖాతాలు తెరచి సేవలందిస్తున్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, క్యాషియర్ సురేశ్, సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

రుద్రూర్: బొప్పాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాజీ ప్రజాప్రతినిధులను జీపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, సురేందర్, మారుతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు..

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గంగరాజు, శానం సాయిలు, సునీతకుమారి, రమేశ్‌ను పాఠశాల సిబ్బంది, గ్రామపెద్దలు సన్మానించారు. బదిలీపై వెళ్తున్న సునీత కుమారి పాఠశాల కోసం కంప్యూటర్‌ను బహూకరించారు. శానం సాయిలు పాఠశాలలో విద్యార్థులకు మూడేళ్లు సరిపడా నోట్ బుక్స్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మల్లారెడ్డి, అలివేలు, మాజీ సర్పంచులు సాయిబాబా, ఆనంద్, మాజీ ఎంపీటీసీ ఫారుక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ జిల్లా చైర్‌పర్సన్‌గా జ్యోతిరాజ్

బోధన్‌టౌన్: లయన్స్ జిల్లా నీడిబేస్ సర్వీస్ జిల్లా చైర్‌పర్సన్‌గా దమ్మల్ల జ్యోతిరాజ్ ఎన్నికయ్యారు. ఆయన చేసిన సేవలను గుర్తించి చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నట్లు లయన్స్ జిల్లా గవర్నర్ పంపటి నగేశ్ తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్‌ఆఫ్ రాయల్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ జమీలొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా దమ్మల్ల జ్యోతిరాజ్, కోశాధికారిగా గుంజి రవీందర్ ఎన్నికయ్యారు.

డిమాండ్లు పరిష్కరించాలని వినతి



డొంకేశ్వర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



ఆర్మూర్‌లో..



మోర్తాడ్‌లో..



రుద్రూర్‌లో..

డొంకేశ్వర్/ ఆర్మూర్‌టౌన్/ మోర్తాడ్/ రుద్రూర్/ వేల్పూర్/ బోధన్/ వర్ని/ మాక్లూర్: డిమాండ్లు పరిష్కరించా లని ప్రభుత్వాన్ని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు ఆయా మండలాల్లోని తహసీల్దార్లకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులను పెంచాలన్నారు. అర్హులైన టీచర్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. డొంకేశ్వర్‌లో తహసీల్దార్ వెంకటరమణకు, ఆర్మూర్‌లో తహసీల్దార్ గజానాన్‌కు, మోర్తాడ్‌లో తహసీల్దార్ సత్యనారాయణకు, రుద్రూర్‌లో తహసీల్దార్ వెంకటేశంకు, వేల్పూర్‌లో తహసీల్దార్ సరితకు, బోధన్‌లో ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌కు, వర్నిలో తహసీల్దార్ సాయిలుకు, మాక్లూర్‌లో తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్‌కు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు వినతిపత్రాలు అందజేశారు.



బోధన్‌లో ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



వేల్పూర్‌లో..



వర్నిలో ధర్నా చేస్తున్న కార్యకర్తలు

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



మోర్తాడ్: కమ్మర్‌పల్లి మండలంలో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో సాయాగౌడ్ సూచించారు. కమ్మర్‌పల్లి పల్లె ప్రకృతి వనాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం ఉప్లూర్ పంచాయతీ ఆవరణలో మొక్కలను పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో విద్యానంద్, కార్యదర్శి శాంతికుమార్ ఉన్నారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగు



బోధన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సంబంధిత అధికారులు జాతీయ నాయకుల విగ్రహాలపై వేసిన ముసుగులు ఇంకా తీయడం లేదు. హెడ్ పోస్టాఫీస్ వద్ద ఉన్న మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి ఇప్పటి వరకు ముసుగు తొలగించలేదు. ఇకనైనా అధికారులు వేసిన ముసుగును తీసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గోరింటాకు సంబరాలు



బోధన్: పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో మహిళలు గోరింటాకు సంబరాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. కాలనీ మహిళలు సౌమ్య, అనిత, గీత, దివ్య, మనోజ్ఞ, సంధ్య, నందకుమారి, మేఘన, జ్యోతి పాల్గొన్నారు.

నోటీసులు జారీ

నవీపేట: మండల కేంద్రంలోని ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం చేడుతున్న అఫ్రోజ్ ఖాన్ అనే హోటల్ యజమానికి నోటీసులు జారీ చేసినట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ బుధవారం తెలిపారు. కొన్ని రోజులుగా పరదాలు అడ్డంగా వేసి ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్నట్లు తమకు తెలిసిందన్నారు. ఇది వరకు చేపట్టిన అనుమతిలేని నిర్మాణాన్ని తొలగిస్తామని పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	డెస్పికబుల్ మీ–4 (తెలుగు) – 11.40, 2.00, 4.20, 6.40, 9.00
స్క్రీన్-2 –	కల్కి –2898ఏడీ (3డీ తెలుగు) – 10.45, 2.30, 6.15, 10.00
స్క్రీన్-3 –	కల్కి –2898ఏడీ (తెలుగు) – 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 –	కల్కి–2898ఏడీ (తెలుగు) – 11.30, 3.15, 7.00, 10.45